ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
5
అనంతపురం

ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

నామినేషన్ల పరిశీలన పూర్తి

◆ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎస్.మంగమ్మ

◆ టిడిపి అభ్యర్థి రంగయ్య నామినేషన్ తిరస్కరణ

◆ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గంకు పరిశీలన పూర్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల మండలి ఎన్నికల నామినేషన్ల తొలి ఘట్టం పూర్తయింది. గురువారం నాటికే నామినేషన్ల స్వీకరణ ముగిసింది. శుక్రవారం నాడు మూడు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సాగింది. ఈనెల 27వ తేదీ వరకు ఉపసంహరణలు జరుగనున్నాయి. అవి పూర్తయిన తరువాత బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్నది తేలనుంది.

స్థానిక సంస్థల ఎన్నిక ఏకగ్రీవం

మండలి ఎన్నికల్లో భాంగా అనంతపురం స్థానిక సంస్థలకు సంబంధించి జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఒకటి తిరస్కరణకు గురైంది. పత్రాల్లో సంతకాలు సరిపోలకపోవడంతో రంగయ్య అనే అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో ఒక్కటే నామినేషన్ స్వీకరణ జరిగినట్టయింది. టిడిపి మద్దతుదారుడిగా పోటీలో నిలిచిన యాడికికి చెందిన వేలూరి రంగయ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాగా జిల్లాలో అధికార వైసిపికి స్థానిక సంస్థల్లో పూర్తి స్థాయి బలముంది. టిడిపి నామమాత్రపు బలం ఉన్నప్పటికీ ఆ పార్టీ తరుపున రంగయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ తిరస్కరణ గురవడంతో అధికార వైసిపి తరుపున నామినేషన్ దాఖలు చేసిన మంగమ్మ విజయానికి మార్గం సుగమమైంది.

పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ నామినేషన్ల పరిశీలనా పూర్తి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి కూడా నామినేసన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టరు కేతన్ గార్గ్ నేతృత్వంలో జరిగింది. ఎన్నికల పరిశీలకులు ప్రవీణ్ ప్రకాశ్ దీనిని పరిశీలించారు. ఈ పరిశీలనల్లో పట్ట భద్రులకు సంబంధించి 63 అభ్యర్థులకుగానూ 51 నామినేషన్లు ఆమోదం పొందాయి. 12 నామినేషన్లు తిరస్క రణకు గురయ్యాయి.

నామినషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు, ఇన్‌ఛార్జి కలెక్టర్

స్థానం	ఆమోదం	తిరస్కరణ
పట్టభద్రులు	51	12
ఉపాధ్యాయ	14	03
స్థానికసంస్థలు	01	01

అదే విధంగా ఉపాధ్యాయ నియోజకవర్గానికిగానూ 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో మూడు నామినేషన్లు తిరస్కరణకు గురవగా 14 ఆమోదం పొందాయి. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులందరి నామినేషన్లు ఆమోదం పొందాయి.

ఈనెల 27వ తేదీ వరకు ఉపసంహరణలు

నామినేషన్ల పరిశీలనలు పూర్తయ్యాయి. ఇక ఎన్నికలకు సంబంధించి మలి ఘట్టం ప్రారంభమైంది. పరిశీలనల్లో పూర్తయిన అభ్యర్థులెవరైన ఎన్నికల నుంచి తప్పుకోవాలంటే తప్పుకునేందుకు వీలుంది. ఉపసంహరణలు ఈనెల 27వ తేది వరకు అవకాశముంది. బరిలోనున్న వారిలో ఎవరెవరు తప్పుకుంటారన్నది అప్పటి వరకు చూడాల్సి ఉంటుంది.

మున్సిపల్ కార్మికులకు

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నాడు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల వారే అత్యధికంగా పని చేస్తున్నారని తెలిపారు. నగరంలో అద్దె ఇళ్లలో ఉండి అద్దెలు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు కొన్ని ప్రాంతాల్లో అద్దెకు ఇళ్లు కూడా ఇవ్వని దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లల చదువులు, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర ధరలు పెరిగాయని తెలిపారు. కుటుంబాలు పోషించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. 20 సంవత్సరాలుగా కార్మికులు నగర ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదన్నారు. పేదలైన కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర 1 కమిటీ కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటి సభ్యులు లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి, జిల్లా నాయకులు తిరుమలేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల సంఘం నగర కమిటీ ఎన్నిక

మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల యూనియన్ అనంతపురం నగర కమిటీలో మార్పులు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ తెలిపారు. రైతు బజార్‌లోని మున్సిపల్ జిమ్ సెంటర్ ఆవరణంలో సమావేశమైన మున్సిపల్ కార్మికుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, నగర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, నగర కోశాధికారి లక్ష్మినరసమ్మ, 21 మంది ఆఫీస్ బేరర్స్‌తో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యుత్ కోతలు.. ఎండుతున్న పంటలు..!

◆ చేతికందకుండా పోతున్న 'రబీ' ◆ ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-మడకశిర

అసలే వేసవికాలం ఆపై అప్రకటిత విద్యుత్ కోతలు వెరసి రబీ సీజన్లో బోరుబావుల కింద రైతుల సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు బోరుబావుల్లో నీరు పుష్కలంగా రావడంతో మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా రబీపంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్‌లో అధిక వర్షాలు మూలంగా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు రబీపై ఆశలో పెట్టుకున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి వేరుశనగ, మొక్కజొన్న, రాగి, వరి తదితర పంటలను సాగు చేశారు. రబీ ప్రారంభంలో వ్యవసాయానికి 7 గంటల పాటు రెండు విడతలుగా విద్యుత్‌ను అందించేవారు. దీంతో పంటలు బాగా ఉండేవి. గత నెల రోజుల నుంచి వ్యవసాయానికి ఉన్న ఫలంగా విద్యుత్ కోతలు విధించారు. వ్యవసాయానికి ఏడు గంటల పాటు పగటి వేళల్లో విద్యుత్ అందించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మడకశిర, గుడిబండ ప్రాంతాల్లో ఇది అమలుకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళల్లో నాలుగు గంటలు, రాత్రి వేళల్లో మూడు గంటలపాటు సరఫరా చేస్తున్నామని చెబుతున్నా గత 15 రోజుల నుంచి ఇది సక్రమంగా అమలుకావడం లేదు. వేళాపాలాలేని విద్యుత్ కోతలతో పంటలు ఎండుదశకు చేరుకుంటున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఓవర్‌లోడ్ వల్లనే విద్యుత్ సమస్య ఏర్పడుతోందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో పంటల సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఓవర్‌లోడ్ ఎలా అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు దీనిపై స్పందించి పూర్తి స్థాయిలో పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ కోతలతో ఎండుతున్న వేరుశనగ పంట

కోతలు అధికం

ఇటీవల విద్యుత్ కోతలు అధికం అయ్యాయి. రబీ ప్రారంభంలో 7 గంటల పాటు పగటి విద్యుత్ సరఫరా చేశారు. గత 15 రోజులుగా మా గ్రామంలో వ్యవసాయానికి విద్యుత్ ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను విద్యుత్ అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదు. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో నష్టపోతున్నాం.

తిప్పన్న, మండలపల్లి గ్రామం, గుడిబండ మండలం.

అధిక లోడ్‌తోనే సమస్య

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ అందిస్తున్నాం. కొన్నిచోట్ల గతంలో ఉన్న విద్యుత్ బోర్ల కంటే అధికంగా రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఓవర్‌లోడ్ అయ్యి కొన్ని ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా నిలిచిపోతోంది. ఓవర్ లోడ్ ఉన్న గ్రామాలను గుర్తించి ఈ సమస్య పరిష్కారానికి అదనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటుచేస్తాం. లోవోల్టేజ్ సమస్య పరిష్కరించి వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

సుబ్రమణ్యప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీ.

మోడీ పాలనలో రాష్ట్రానికి అన్ని విధాలా నష్టం

◆ అదానీ అవినీతిని ప్రోత్సహిస్తున్న బిజెపి ◆ కేంద్రం తీరుపై సిపిఎం నేతల ఆగ్రహం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులూ చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్ష, అదానీ అవినీతిని వ్యతిరేకిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై భారాలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదాను నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదన్నారు. దీనిపై రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులు నోరెత్తి మాట్లాడక పోవడం దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అదానీ దేశ సంపదను దోచుకుంటున్నారని, ప్రధాని మోడీ ఈయన్ను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అదానీ తప్పుడు కంపెనీలు సష్టించి అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తీసుకొచ్చాడని విమర్శించారు. చిన్న మదుపుదారులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారని తెలిపారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన ప్రకతి వనరులను ఆదానీపరం చేస్తుండడం సరికాదన్నారు. సోలార్ ఎనర్జీ పేరుతో రాష్ట్రంలోని భూములన్ని అదానీకి అప్పగించడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆదానీ పట్ల మెతక వైఖరిగా ఉంటే ఈ రాష్ట్రానికి అన్యాయం చేసిన వారవుతారని తెలిపారు. రాష్ట్రం కోసం సిపిఎం చేస్తున్న పోరాటాల్లో వైఎస్ఆర్‌సిపి, టిడిపి కలిసి వచ్చి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలీ, ఇర్ఫాన్, గోపాల్, బాలకష్ణ, మసూద్, ఎన్టీఆర్ శీన, రాజు, వరలక్ష్మి, ఏటీఎం నాగరాజు, లక్ష్మీనారాయణ, కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, రజక సంఘం నాయకులు నాగభూషణం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ రెడ్డి, ఇస్మాయిల్, వన్నూరప్ప, ఆది, అజాం పాల్గొన్నారు.

అనంతపురం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

నీరున్నా..తప్పని ఎద్దడి..!

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో సరిపడా నీరు ఉన్నా పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి తప్పడంలేదు. జిల్లాలో ఏ పురపాలక సంఘానికీ లేనివిధంగా రాయదుర్గంలో మూడు రక్షిత తాగునీటి పథకాలను చేపట్టారు. అయితే పట్టణంలో పలుచోట్ల, శివారు కాలనీవాసులకు తాగునీరు అందడం లేదు. రూ.50 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పుష్కరకాలం క్రితం డాక్టర్ వైఎస్సార్ రక్షిత తాగునీటి పథకం చేపట్టారు. 2030 సంవత్సరం వరకు పట్టణ జనాభా అవసరాలకు సరిపోయేలా పథకం రూపొందించారు. ఇప్పటికీ పైతోట, మత్రాసు కాలనీ, వాల్మీకి నగర్, ఇందిరమ్మ కాలనీ తదితర శివారు కాలనీల ప్రజలు రక్షిత తాగునీటిని పొందలేకపోతున్నారు. ప్రస్తుతం రాయదుర్గం పట్టణ జనాభా 70 వేలకు పైమాటే. నిర్ణీత ప్రమాణాల మేరకు తలసరి నీటి సరఫరా 100 లీటర్లు లెక్క వేసినా రోజూ ఏడు మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. రోజు 10 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ ఇంజినీర్ రామమూర్తి తెలిపారు. అదే నిజమైతే పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉండకూడదు. మూడు నాలుగు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. రెండు రోజులకోసారి పట్టణంలో నీటి సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. పై తోట, వాల్మీకి నగర్ మత్రాసు కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో డాక్టర్ వైఎస్సార్ రక్షిత తాగునీటి పథకం నీరు అందడం లేదు. స్థానికంగా పురపాలక సంఘం ఏర్పాటు చేసిన బోరుబావుల నీరే వారికి అందుతున్నాయి. కనేకల్ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గరిష్ట నీటి సామర్థ్యం 3050 మిలియన్ లీటర్లు కాగా.. శుక్రవారం నాటికి 2,960 మిలియన్ లీటర్ల నీరు నిల్వవున్నట్లు ఇంజినీర్ రామమూర్తి తెలిపారు. మూడు మోటార్ల ద్వారా నీటిని ఎగువ కాలువ నుండి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మరో రెండు రోజుల్లో తుంగభద్ర ఎగువ కాలువకు ప్రాజెక్టు అధికారులు నీటి సరఫరా నిలిపివేయనున్నారు. ప్రస్తుతం కాలువలోలో నీటి నిలువ ఆధారంగా మరో 10 రోజుల వరకు నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి పంపింగ్ చేసే అవకాశం ఉందన్నారు. రిజర్వాయర్‌లోని నీరు 300 రోజులకు పట్టణ అవసరాలకు సరిపోతుందన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి పట్టణ పొలిమేరలోని నీటి శుద్ధి కేంద్రం వరకు ఉన్న పంపింగ్ పైపులైన్‌లో మూడు చోట్ల లీకేజీలు ఉన్నాయని, ఉగాది పండుగ అనంతరం వాటికి మరమ్మతులు చేపడతామని ఇంజినీర్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ప్రతి రోజూ సగటున 13 ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పట్టణంలో నీటి ఎద్దడిని నివారించాలని, రోజూ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


నీటితో రాయదుర్గం సమ్మర్ స్టోరేజి ట్యాంక్

పాడి రైతులకు రూ.3 లక్షల బోనస్

విజయ పాల డెయిరీ మేనేజర్ జి.తిమ్మారెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మహిళలు యజమానులుగా అభివృద్ధి చెందాలనే ముఖ్య ఉద్దేశంతోనే విజయ పాల డెయిరీ ద్వారా ప్రతి సంవత్సరం పాడి రైతులకు బోనస్‌ను అందిస్తున్నామని ఆత్మకూరు విజయ పాల డెయిరీ కేంద్రం మేనేజర్ జి.తిమ్మారెడ్డి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం చైర్మన్ ఎస్‌వి.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు మండల పరిధిలోని గాండ్లపర్తి, జి.కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో విజయ పాల డెయిరీ ద్వారా లీటర్ పాలకు ఒక రూపాయి బోనస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచులు పుల్లలరేవు చంద్రకళ, చిన్న కృష్ణారెడ్డి, బోయ నరేష్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బాలకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సంధర్భంగా మేనేజర్ తిమ్మారెడ్డి మాట్లాడుతూ పాల వ్యాపారంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశలో భాగంగా 2022 జనవరి నుండి డిసెంబర్ వరకు రెండు గ్రామాల్లోనూ విజయ పాల డెయిరీ రైతులకు రూ.3 లక్షల బోనస్ డబ్బును పంపిణీ చేశామని తెలియజేశారు. ఒక పాడి రైతు రోజుకు 15 లీటర్ల పాలు డెయిరీకి అందించినట్లయితే ఆ రైతుకు ఇన్సూరెన్స్‌తోపాటు ఆవులు, గేదెలు కొని తెచ్చుకోవడానికి రుణాలను మంజూరు చేస్తున్నామని చెప్పారు. పాల తూకాల్లోనూ, బిల్లుల చెల్లింపుల్లోను ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ రైతులకు న్యాయం చేస్తున్న ఏకైక డెయిరీ విజయ పాల డెయిరీ అన్నారు. ఉచితంగా నాణ్యమైన గడ్డి విత్తనాలు, గడ్డి కటింగ్ చేసే మిషన్లు, సబ్సిడీతో పాడి షెడ్లను రైతులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఏజెంట్లు జి.రాఘవేంద్రరెడ్డి, దివ్య, రమణమ్మ, పాపమ్మ, పాడి రైతులు రామచంద్ర, విజయశంకర్, యోగేంద్ర, మోహన్, శివయ్య, డీలర్లు వెంకటనారాయణమ్మ, ప్రసాద్‌రెడ్డి, వెంకటేష్, జయమ్మ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోనస్ అందజేస్తున్న దృశ్యం

కోవిడ్‌లో మైక్రోబయాలజీ సేవలు మరువలేనివి

ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

ప్రజాశక్తి-అనంతపురం

కోవిడ్‌లో మైక్రోబయాలజీ సేవలు మరువలేనివని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మైరెడ్డి నీరజ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య సూక్ష్మజీవ శాస్త్ర విభాగంలోలో వైరల్ రీసెర్చ్ డయాగ్నొస్టిక్ లాబరేటరీలో ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ ప్రాముఖ్యతపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ శాంతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ నీరజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధులను కచ్చితంగా నిర్ధారణ చేయడంలో ఆర్‌టిపిసిఆర్ పాత్ర, ముఖ్యమైనదన్నారు. కరోనా సమయంలో, విఆర్‌డిఎల్ సిబ్బంది సేవలు, సూక్ష్మజీవ శాస్త్ర సిబ్బంది సేవలు మరువలేనివన్నారు. ప్రాణాలకు తెగించి వారు చేస్తున్న కర్తవ్యం అభినందనీయమని కొనియాడారు. కళాశాలలోని 70 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు ఈ సదుపాయాన్ని అందిపుచ్చుకొని శిక్షణ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మేనిగ శైలజ, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, ట్యూటర్లు సునీల్ కుమార్, ఆదిరెడ్డి పరదేశి నాయుడు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ లలితా భవాని, విఆర్‌డిఎల్ సైంటిస్ట్ డాక్టర్ అనురాధ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు పాణిగ్రహి, నవాజ్, దివ్య, ఎల్లం నాయుడు, యుడిన్, డైజీ, అభినయ, వైరాలజీ ల్యాబ్ సిబ్బంది గీత, చైతన్య, రాజశేఖర్, సరిత, శాలిని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అల్ట్రాటెక్ సిమెంట్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షకు 132 మంది విద్యార్థులు హాజరయ్యారు. వార్షిక వేతనం రూ.4 లక్షలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ప్రాంగణ నియామక సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

రాయదుర్గం : శుక్రవారం జరగాల్సిన రాయదుర్గం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. సమావేశానికి సభ్యులు కనీస సంఖ్యలో కూడా రాకపోవడం వల్ల సమావేశం వాయిదా పడినట్లు తెలిపారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామన్నారు.

సమీక్ష సమావేశం

నార్పల : స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎఒ ముస్తఫా ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం-2023పై పెండింగ్ గ్రూపు అధ్యక్షులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ.. నాయనపల్లి, నడిమి దొడ్డి, శిద్దరాచర్ల, గూగూడు, గంగనపల్లి, నార్పల-1, నార్పల-4, దుగుమర్రి గ్రూప్ సభ్యులు తమకు కావలసిన పరికరాలను ఎన్నుకోవాలన్నారు. వాటికి సంబంధించిన నగదు మొత్తంలో 50 శాతం ఈనెల 28వ తేది చెల్లించాలన్నారు. మార్చి 5వ తేదీ లోపు పర్చేజ్ ఆర్డర్ సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రూపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

రాయదుర్గం : రాయదుర్గం నుండి బళ్ళారి మీదుగా కర్నూలుకు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసు శుక్రవారం అంతరాయం కలిగింది. ఉదయం రాయదుర్గం నుండి బయలుదేరిన ఆర్టీసీ బస్సు డి.హిరేహాల్ మండలం హిర్దేహాళ్ సమీపంలో బ్రేక్ డౌన్ అయ్యి ఆగిపోయింది. బస్సు సిబ్బంది వెంటనే సమాచారాన్ని రాయదుర్గం ఆర్టిసి డిపో మేనేజర్‌కు తెలియజేశారు. మెకానిక్ వెళ్లి మరమ్మతులు చేసిన అనంతరం బస్సు ముందుకు కదిలింది. ఈ విషయమై డిపో మేనేజర్ సురేష్‌ను వివరణ కోరగా బస్సు క్లచ్ వద్ద బోల్ట్ కుదుపులకు విరిగిపోగా బస్సు ఆగిపోయిందని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులను కండీషన్‌లో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వడ్ల షెక్షావలికి ఆత్మీయ సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ పిఎసిఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి కుటుంబంతో కలిసి ఉమ్రాహ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా పలువురు వైసిపి మైనారిటీ విభాగం నాయకులు, ఇతర నేతలు శుక్రవారం ఆయనను కలిసి శాలువా, పూలమాలలతో ఆత్మీయ సత్కారం చేశారు. ఉమ్రాహ్ పర్యటన సజావుగా జరిగి విజయవంతంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గెలుపు కోసం మక్కాలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉమ్రాహ్ యాత్రకు వెళుతున్న వడ్ల హాజీ షేక్షావలి, వడ్ల షమీర్, వడ్ల అనస్‌ల పర్యటన విజయవంతం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యుడు మీరం బాషా, పిఎసిఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్, కో అప్షన్ పామిడి సలీమ్, పీఏసీఎస్ సీఈవో గౌస్, ఇంతియాజ్, అన్వర్, ఆసిఫ్, హోతూరు బాషా, అబ్దుల్లా, అయ్యర్ దాదు, షాకీర్, బేల్దార్ శర్మాస్, జిలన్, రఫీక్, జాకీర్, బాషా, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న ముస్లిం సోదరులు

In the Court of the Hon'ble District Judge: Ananthapuramu

I.A.No.39/2022 IN A.S.No. /2023

Between:

1.G.Padmavathi 2.G.Prabhavathi
...Petitioners/Appellants

And

G.Ananda Vardhan & others
...Respondants/Respondants

Notice to the Respondants No:1&2

1.G.Ananda Vardhan S/o Late G.Ramakrishna, R/o D.No.14-429, Kamalanagar, Anantapuram.

2.G.Vijaya Kumari W/o Narayanappa, R/o D.No.12/2/691, Near Ambedkar Bhavan, Anantapuram.

Sir & Medam,
Please take notice that where as the above named petitioners filed the above petition condoning the delay in filing the above case and hereby required to answer the same by pleader or by person on 07-03-2023 at 10:30 AM, failing which the said matter will be heard and determined by exparte by the court.

(By Court Order)

N.Jayaram
Advocate for the Plaintiff

మోడీ, అదానీలు దేశ ఆర్థిక వ్యవస్థకే ప్రమాదం

జిల్లాలో అదానీకి 40 వేల ఎకరాలు ఇవ్వడం దారుణం
సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-శింగనమల

జిల్లాలో 40 వేల ఎకరాల భూమిని అదానీకి ఇవ్వడం దారుణమని సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు అన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలను, ప్రజలపై అదనపు భారాలు, అదానీ అవినీతికి నిరసనగా స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. కేంద్రం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించిందన్నారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిందన్నారు. పెరిగిన ధరలతో అప్పులు రెట్టింపై ఆత్మహత్య లు పెరిగాయన్నారు. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్లో భారీగా కోతలు విధించింద న్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సంక్షేమ నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రజాపంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారన్నారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఈ బడ్జెట్లో భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఆంధ్ర, కర్ణాటకల మధ్య విద్వేషాలు పెంచి రానున్న కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నిందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపలేదన్నారు. కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వలేదన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామమాత్రంగా నిధులు విడుదలచేశారన్నారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా రాష్ట్రానికి చెందిన ఎంపీలు నోరు ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, లక్ష్మీనారాయణ రెడ్డి, ఆంజనేయులు, ఓబిరెడ్డి, రామయ్య, రాము, తులసీదాస్, చిన్న నాగమణి, ఈశ్వరయ్య, సూరి, బేల్దారి పెద్దన్న, ఆంజనేయులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా అదానీ అవినీతికి నిరసనగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతి ప్రసాద్, సాకే నాగరాజు, రమేష్, రాము నాయక్, అబ్దుల్లా, రంగమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మోడీ, అదానీలు దేశ ఆర్థిక వ్యవస్థకే ప్రమాదమని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులను భారీగా తగ్గించిందన్నారు. దీనివల్ల కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లా ఉపాధి కూలీలకు పనులు దొరికే అవకాశాలు తగ్గుతాయన్నారు. ఎరువుల సబ్సిడీకి బడ్జెట్లో కోత వల్ల వాటి ధరలు పెరుగుతాయన్నారు. ఆహార సబ్సిడీకి కోత వల్ల రాబోవు కాలంలో రేషన్ కార్డులు తగ్గించే ప్రమాదం ఉందన్నారు. రైతులు, కూలీలు, కార్మికులు, కష్టజీవులకి కోతలు పెట్టడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభం, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. మోడీ, అదాని ఆర్థిక అరాచకత్వాన్ని హిండెన్‌బర్గ్ సంస్థ బట్టబయలు చేసిందన్నారు. దీనిపై మోడీ ఒక్క మాట్లాడకుండా ఉండడం దేశానికి ప్రమాదం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సి.నాగేంద్ర, నాగరాజు, అభి, చంటి, సుబ్బులు, అంకాలు, బద్రీ, నరసింహులు, సుంకయ్య, పెద్ద పుల్లయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఉరవకొండ : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టానికి, ఆదాని అవినీతిని వ్యతిరేకిస్తూ సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్ ఆధ్వర్యంలో స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, నాయకులు ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, బాబు, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ అన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టానికి వ్యతిరేకంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి సరస్వతమ్మ, మండల కమిటీ సభ్యులు వెంకటమ్మ, రాజేశ్వరమ్మ, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి జయమ్మ, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : కేంద్రం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో జాతీయ ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించడం శోచనీయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగనాథ్, రఘు, విక్రమ్, తిప్పేస్వామి, నాగరాజు, మనోజ్, వంశీ, ఉదయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఉరవకొండలో నిరసన

చేపల వ్యాపారులకు సహకారం

ఫిషరీష్ డిడి శాంతి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని చేపల వ్యాపారులకు చెరువుల వద్దనే తక్కువ హోల్‌సేల్ ధరలకు అన్ని రకాల చేపలను అందిస్తామని వ్యాపారాలకు సహాయ, సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని ఫిషరీస్ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శాంతి తెలిపారు. ఫిష్ ఆంధ్ర..ఫిట్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో చేపల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషరీష్ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపల వ్యాపారుల కోసం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. చేపల వ్యాపారులకు ప్రభుత్వ బ్యాంకుల సహకారంతో సబ్సిడీతో రుణాలు అందజేసి వారికి చెరువుల వద్దనే హోల్‌సేల్ ధరలకు అన్ని రకాల చేపలు, రొయ్యలు అందిస్తుందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగించుకుని చేపల వ్యాపారులు ఆర్థిక పురోభివద్ధిని సాధించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ చేపల వ్యాపారులకు మున్సిపాలిటీ ద్వారా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో మెప్మా టిపిఆర్ఒ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఉరవకొండ : ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 26వ తేదీ నుండి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 232 మంది జనరల్ గ్రూపులకు సంబంధించిన విద్యార్థులు, 162 మంది వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన విద్యార్థులు ఉన్నారన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు సెషన్లుగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు దృష్టిలో ఉంచుకొని వారికి కేటాయించిన సమయంలో సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రాక్టికల్ నిర్వహించేటప్పుడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలిపేయాలి

రాయలసీమ ఉద్యమనేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్నాటక ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని రాయలసీమ ఉద్యమ నేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యునైటెడ్ ఫోరం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపి ముఖ్యమంత్రుల నిర్లక్ష్యం వల్ల తుంగభద్ర డ్యామ్ పై ప్రాంతంలో కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా ప్రాజెక్టులను నిర్మిస్తూనే ఉందన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రం నిధులను కూడా విడుదల చేయడం బాధాకరమన్నారు. తుంగభద్ర డ్యామ్ పై ఆధారపడి హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి, రాజోలిబండ, కెసి కెనాల్ ప్రాజెక్టులతో రాయలసీమకు అడపాదడపా నికరజలాలు అందుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు రాయలసీమలో పాదయాత్ర చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నిర్ణయించిందన్నారు. స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర రాజోలి బండ నుండి ప్రారంభమై ఆదోనిలో 28వ తేది ప్రజా ప్రదర్శనతో ముగుస్తుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రఫ్ తాడిపత్రి సమన్వయకర్త పుట్లూరు భాస్కర్‌రెడ్డి, దూదేకుల కుళ్లాయప్ప, పాలగిరి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిబి రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా టిబి కంట్రోల్ అధికారి అనుపమ జేమ్స్

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

టిబి రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ధ్యేయమని జిల్లా టిబి కంట్రోల్ అధికారి అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. శనివారం ఉరవకొండలో లయన్స్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో ఉచిత పౌష్టిక ఆహార కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా జిల్లా టిబి కంట్రోల్ అధికారి అనుపమ జేమ్స్ ప్రభుత్వ వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి సాహితీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనుపమ మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులకు సహాయ సహకారాలు అందించడానికి ఉరవకొండ లయన్స్ క్లబ్ వారు ముందుకొచ్చి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున నిశ్చయమిత్రగా రిజిస్టర్ చేయించుకుని నిరుపేదలైన 40 మందికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. టిబి సోకినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టిబి వ్యాధి నిర్మూలనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. టీబీ సోకిన వారిని గుర్తించి వారికి ప్రభుత్వమే వైద్య ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగించుకుంటే ఆరు నెలల్లో టీబీ వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న 40 మంది టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను ఆరు నెలలపాటు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టడం హర్షణీయం అన్నారు. లయన్స్ క్లబ్ సేవలను చూసి ప్రతి ఒక్కరూ వారికి చేతనైన సహాయం చేయడానికి ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజర్ నజీర్, రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, గణేష్ బాబు, ప్రభాకర్ నాయుడు, నాగేశ్వర్‌రావు, ఎంసీ.నాగభూషణ, కృష్ణ మోహన్, గంగాధర్, శ్రీరాములు, ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, ఎస్‌టిఎల్ కుళ్లాయమ్మ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మంటలు వ్యాపించకుండా చర్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని బళ్ళారి రోడ్డు సమీపంలో ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డులోని చెత్తకు మంటలు వ్యాపించకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం చెత్తను అన్‌లోడ్ చేయడానికి వెళ్లిన కాంపాక్టర్- లోడర్ వాహనం చక్రాలు చెత్తలో ఇరుక్కుపోయి వాహనం ముందుకు వెళ్లే ప్రయత్నంలో సైలెన్సర్ నుండి వచ్చిన నిప్పురవ్వలు ఎగసిపడి పొడి చెత్తకు మంటలు వ్యాపించడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసినప్పటికీ చెత్త నుండి పొగ వస్తుండడంతో అధికారులు శుక్రవారం అగ్నిమాపక దళ వాహనం, మున్సిపల్ నీటి ట్యాంకర్, జెసిబిలను ఉపయోగించి పొగను పూర్తిగా ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, మున్సిపల్ ఇంజినీర్ రామమూర్తి పాల్గొన్నారు.

బొమ్మనహాల్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం..

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండల కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం వారపుసంత జరుగుతుంది. బళ్లారి, కనేకల్ ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు, తినుబండారాల దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేస్తారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఆస్పత్రికి పేషెంట్‌ను తీసుకెళ్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు, ద్విచక్రవాహనాలు సుమారు 30 నిమిషాల పాటు ఆగిపోయాయి. వారపు సంతను ప్రధాన రహదారిపై నిర్వహిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వారపు సంత నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-నార్పల

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన నార్పల మండలం నరసాపురం గ్రామ సమీపంలోని హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అరటిపళ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని గూగూడు వైపు నుంచి వస్తున్న లారీ నరసాపురం సమీపంలోని హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద ఢీకొంది. ఆ కుదుపుకు బొలెరో వాహనం కూలీలను ఎక్కించుకొని వెళ్తున్న పాసింజర్ ఆటోని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గూగూడు గ్రామానికి చెందిన పెద్దక్క, రామలక్ష్మి, రాగసుధా, పెద్దన్న గాయపడ్డారు. గాయపడ్డ వారికి నార్పల ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రాఘవరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో విద్యార్థినికి..

పెద్దపప్పూరు : స్కూలు వద్ద రోడ్డు దాటుతూ కారు ఢీకొనడంతో విద్యార్థినికి గాయాలైన సంఘటన పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ముచ్చుకోట గ్రామంలోని యుపియుపి స్కూల్లో 5వ తరగతి చదువుతున్న అయేషా (10) ఇంటర్వెల్‌లో ఇంటికి వెళ్లింది. తిరిగి స్కూల్‌కు వెళ్తూ రోడ్డు దాటుతుండగా అనంతపురం నుండి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అయేషా తలకు, చేతులకు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విద్యార్థినిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కొళాయి విషయంలో ఘర్షణ

ప్రజాశక్తి-పుట్లూరు

కొళాయి విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయాలైన సంఘటన పుట్లూరు మండలం గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గొల్లపల్లి గ్రామంలో ఇంటింటికీ కుల్లాయి పైపులైన్ వేస్తుండగా బలిజ రవి అనే వ్యక్తి తన అన్న ఇంటికి కొళాయి వేయాలని కోరాడు. ఈ విషయంలో బలిజ రవి, వడ్డే గోపాల్ మధ్య వాదన జరిగింది. బలిజ రవి రాయితీసుకుని వడ్డే గోపాల్ తలపై కొట్టాడు. గాయపడ్డ వడ్డే గోపాల్‌ని చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట ప్రసాద్ కేసు నమోదు చేశారు.

కాలిబూడిదైన గొర్రె పిల్లలు

అగ్నిప్రమాదంలో 80 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కంబదూరు మండలంలోని ఎగువపల్లి గ్రామానికి చెందిన గొల్లబడప్ప, కురుబ రంగారెడ్డికి అనే గొర్రెకాపర్లకు చెందిన 80 గొర్రె పిల్లలు శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఓ రైతు పొలంలో చింతచెట్టు కింద ఉన్న ఎండు గడ్డికి నిప్పుపెట్టారు. మంటలు వ్యాపించడంతో గొర్రె పిల్లలు కాలిబూడిదయ్యాయని కాపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

అరటి చెట్లు దగ్ధం

రూ. 6 లక్షలు నష్టం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో వేలురు రాఘవనాయుడుకి చెందిన అరటి చెట్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు ఎకరాల్లోని అరటి చెట్లు, డ్రిప్ పరికరాలు మొత్తం కాలిబుడిదయ్యాయి. మూడేళ్లుగా అరటికి కనీస మద్దతు ధర లేదు. ఈ ఏడాది పంట బాగా పండడంతో పాటు ధర కూడా బాగా ఉంది. చేతికొచ్చిన అరటిపంట కాలి బూడిదవ్వడంతో బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి-పుట్లూరు

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన పుట్లూరు మండలం పోతిరెడ్డిపల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సత్యమయ్య కుమారుడు రవీంద్రారెడ్డికి చెందిన ట్రాక్టరును పనుల నిమిత్తం డ్రైవర్ గాండ్లపాడుకు తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పోతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు

నగర కమిషనర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకుగాను నగరపాలక సంస్థ ఆవరణంలో పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో కమిషనర్ భాగ్యలక్ష్మి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అనంతపురం నగరానికి 47 క్లాప్ ఆటోలు వచ్చాయన్నారు. నగరంలోని అన్ని సచివాలయాలకు క్లాప్ ఆటోలను కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ కార్యదర్శులకు, క్లాప్ ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజూ ఇంటి నుండి తడి పొడి చెత్తను తీసుకునేలా చూడాలని, నిర్లక్ష్యం కూడదని కార్యదర్శులను ఆదేశించారు. షాపు యజమానుల నుంచి ట్రేడ్ లైసెన్స్ సకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ కార్యదర్శులు వారి సచివాలయ పరిధిలోని పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు మరింత కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాలు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డీఈ.రాంప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి